# ఆడవాళ్లు పుట్టరు

"నాన్నగారూ ! సైకిలు కొనిపెట్టండి"

"కొందాం లేమ్మా —"

"ఇంటర్మీడియేట్‌లో చేరేటప్పుడు కొంటానన్నారు. ఇంటర్ పరీక్షలు కూడా అయిపోయాయి. మళ్ళీకాలేజీలు తెరిచే నాటికయినా కొనండి !"

"మళ్ళీ కాలేజీ ఎప్పుడు తెరుస్తారు ?

"జూలై రెండో తారీకు 1984"

"ఇంకా బోలెడు టైముంది కొందాంలే"

కామేశ్వరి బియస్సీ ఫస్టియర్ చదువుతుంది. తండ్రి సన్యాసిరావు తాలూకా ఆఫీసులో యూడీ క్లర్కుగా పనిచేస్తున్నాడు.

సన్యాసిరావుకు నలుగురు పిల్లలు. కామేశ్వరి పెద్దది తరువాత ఇద్దరు పిల్లలు చివర ఒక మగపిల్లవాడు. కామాక్షమ్మ పూర్వకాలపు మనిషి తర్డుఫారం వరకూ చదువుకుంది. చాలా ఛాందసురాలు. కామేశ్వరిని పదో తరగతితో ఆపేసి పెళ్లి సంబంధాలు చూడమని కూచుంది. సన్యాసిరావు ఇంటరువరకూ చదివించి ఆపేద్దామనుకున్నాడు .. పేసవుతుందో, లేదోనని అనుమానంతో ఇన్నాళ్లనుంచీ కొనమంటున్న సైకిలును వాయిదావేసి ఇంటరు పాసైతే చూద్దాంలే అన్నాడు. కొత్త మెతక మనిషి. పెద్దకూతురు కామేశ్వరి చదువు ఇంటరుమీడియటుతో ఆగిపోవలసింది. కాకినాడ కాలేజీలో పనిచేస్తున్న మేనమామ చదివించమని మరీమరీ చెబితే కాలేజీలో చేర్పించాడు. చదువుకున్న పిల్లలకు ఈమధ్య డిమాండుగా ఉందని, పెళ్లికొడుకు దొరకటం సులభమని, తక్కువకట్నంతో తేలిపోతుందని నచ్చ చెప్పాడు. ఆ మాట కామాక్షమ్మకు నచ్చింది.

కామాక్షమ్మ కూతుర్ని నిరంతరం కొరుక్కు తినేస్తూ వుంటుంది .

"ఏమిటా నవ్వులు? నవ్వినా యిగువిధాలచేటట"

"ఆ పరుగేమిటి నెమ్మళంగా నడువలేవూ పొందిక నేర్చుకో బాగుపడతావు."

"అర్ధరాత్రి దాటిందాక ఆ చదువేమిటి? ఆడదానికి అంతసేపు చదువు పనికిరాదు వద్దండీ అంటే ఎవరన్నా వింటారా?"

"ఇంతాలస్యం అయిందేం ఈవాళ కాలేజీనుంచిరావడం ? ఫంక్షన్ అయ్యిందా? మొన్న ఒకరోజేమో ప్రాక్టికల్స్ ఉన్నాయన్నావు. మీనాన్నగారిని అడుగుతానుండు. ఎదిగిన ఆడపిల్ల దీపాలు పెట్టిన తరవాత రోడ్లంట తిరగడం ఎన్నడైనా విన్నామా మాకాలంలో?!"

"చేతులకు లక్షణంగా గాజులు వేసుకోవేమిటి ? ఓచేతికి వాచీ మరోచేతికి లింగు లింగుమని ఒకటేగాజు అదేం వాజూకే వాతల్లీ. ఆడదానికి బొట్టు, గాజులు శుభమూ లక్ష్మీప్రదమూనూ."

ఇదీ కామాక్షమ్మ ధోరణి.

భర్తతో మాట్లాడే టప్పుడూ ఇందుకు అనుగుణంగానే ఉంటుంది.

"పెళ్లి సంబంధాలు చూడ్డం ప్రారంభించండి - ఇప్పటి నుంచే ప్రారంభిస్తే దాని చదువు కడతేరే నాటికి ఓ అయ్యచేతిలో పెట్టొచ్చు".

"పక్కవీధిలో సత్యవతమ్మ కూతురికి పెళ్లిసంబంధం కుదిరింది. చదువుమాన్పించేసి రేపు వైశాఖంలో పెళ్లిచేస్తారట. కట్టుకొన్నవాడికి ఇష్టముంటే ప్రయివేటుగా చదువుకుంటుంది. చదువుకుంటే మాత్రం పెళ్లిచేసుకోరూ?"

" మన కామేశ్వరి వయసుదే మాపిన్నిగారమ్మాయి నళినాక్షి. గత ఎండల్లో పెళ్లయింది ఇప్పుడు మూడోనెలట. రేపో నేడో పండంటి బిడ్డని ఎత్తుకుంటుంది."

" దానికి సైకిలు కొని పెడతానన్నారా ? ఎవత్తో సైకిలు తొక్కిందంటే ఏ కిరస్తానీదో బరితెగించిందో అయి ఉంటుంది. కామేశ్వరికి సైకిలు కొన్నారంటే బావుండదు చెబుతున్నాను. నామాట అసలు పడనివ్వరేమిటి కొంపలోను? కాలేజినుంచి ఆలస్యంగా రావద్దని చెప్పండి. ఒక్కనాడు నాలుగున్నరకి కాలేజినుంచి రాలేదు. ఎప్పుడూ ఏవో సాకులు చెబుతుంది. ప్రయివేటు క్లాసట, ఫంక్షనట, హోప్ టెస్టట. ఆడదానికి అంతచేటు సావాసాలు పనికిరావు."

ఇదీవరస

కామేశ్వరికి పద్దెనిమిదేళ్లు .

ప్రపంచం రంగురంగులుగా కనిపిస్తుంది. ఎప్పడూ ఏవోవో పంచరంగుల కలల్లో తేలుతూవుంటుంది.

అందమైన ఆధునికమైన దుస్తులు వేసుకోవాలని, స్వేచ్ఛగా తిరగాలని వుంటుంది.

శైలజ ఒక్కనాడూ లంగా, వోణీ వేసుకోదు , పంజాబీ డ్రస్సు వేసుకొంటుంది. లూజుగా వుండే పాంటూ షర్టు వేసుకుంటుంది. మాక్సీ వేసుకొంటుంది. టి.వి.యస్ , మీద కాలేజి కి వస్తుంది.

మనోరమ సైకిలు మీద వస్తుంది. ఆటలు బలే ఆడుతుంది. చాలా పొడవుగా వుంటుంది.

రోజా వ్యాయామం చెయ్యమని చెప్పింది. ఆటలాడమని చెప్పింది. కామేశ్వరికి అంత అదృష్టమా.

చంప సరేసరి మిస్‌కాలేజ్ అంటారు. ఎప్పుడూ ఆమె వెంట యిద్దరు ముగ్గురైనా పీజీ సెంటరు కుర్రాళ్లుంటారు. ఆటలు మనోరమ కంటే బాగా ఆడుతుంది.

కామేశ్వరి, మనోరమా, శైలజ బై.పీ.సీ

చంప ఎంపీ.సీ.

తమతో పాటే ఇంటర్మీమీడియేట్ చదివిన ఉమా, వాణీ బియస్సీలో జాయినయ్యారు. లతిత, పద్మిని బీకాం చదువుతున్నారు.

సన్యాసిరావుకి కూతురుకు సైకిలు కొనాలనీలేదు, కొనకూడదనీలేదు. కాని కామాక్షమ్మ కొనద్దంటోంది.

భార్య సాధింపు భరించడం కష్టం కనుక కొనలేదు.

కాలేజీ తెరిచారు.

మొదటి రోజు ఎంత కోలాహలమో.

"హాయ్ శైలూ కొత్త డ్రెస్సు బాగుందే. నువ్వు టీవీయస్ మీద తుర్రున పారిపోతావుగాని సరదాగా అలా రోడ్డువెంట నడిచావో చాలాప్రమాదాలు జరుగుతాయి."

" నోరుముయ్యవే వెధవమాటలూనువ్వునూ."

" చంపా ! మొన్నోసారి పీజీ సెంటరబ్బాయి నీ గురించి అడిగాడే ."

" అలాగా? ఏమన్నాడు?."

" నాకు చంపంటే పిచ్చి ప్రేమండీ అని చెప్పాడు "

" ఆమాట చంపతో చెప్పలేకపోయావా? అనలేక పోయావా?."

" అన్నాను గానీ నువ్వు చెంపపగుల గొడతావేమోనని భయమట."

" దద్దమ్మ చచ్చుదద్దమ్మ. ఆ మాత్రం ధైర్యంలేని మొహానికి ప్రేమించడం కూడాను."

" నేను ఇంగ్లీషు పేపరు పాడుచేశానే -".

" పోన్లెద్దు అక్టోబరులో రాయొచ్చు - మరీ అన్నీ ఒకవాయిదాలో పాసై పోతే ఎలా ?

" మాయింటి పక్క ఖాళీస్థలంలో షటిల్‌కోర్టు తయారుచేశామే. ఆడేవాళ్లందరికీ వెల్‌కం" అన్నదిచెంప.

" బాగా ఆటలాడితే శరీరం ఆరోగ్యంగా అందంగా వుంటుంది. ఆ మీనాక్షి చూడు. తనకి చెస్ట్ సరిగ్గా పెరగలేదని ఏడుస్తుంది. ఏటానిక్కో తాగుతూ ఆటలు కూడా ఆడితే శరీరంలో అన్నిభాగాలు చక్కగా పెరుగుతాయి."

" ఛీ పాడుమాటలూ నువ్వునూ."

" సెలవుల్లో మామామయ్యగారింటికి మద్రాసు వెళ్లాను. ఒక ఇంగ్లీషు సినిమా చూశానే ." అని వర్ణించడం మొదలు పెట్టింది మనోరమ .

"ఈ సంగతి విన్నావా ? మన బోటనీ మేడమ్‌కి బదిలీ అయి ఒక మేస్టారు వచ్చేరట".

"నువ్వు చూశావా ?"

"ఆ చూశాను. సుమారు నలభై యేళ్ళుంటాయి"

"చంపేశావు-"

"ఏం పాతికేళ్ళ బాలాకుమారుడైతే బాగుణ్ణా ?"

"ప్రిన్సిపల్ వస్తోంది"

ఎవరి క్లాసుల్లోకి వాళ్లు వెళ్లారు. మర్నాడు క్లాసులో వాళ్లకో కొత్తమొహం కనపడింది తనని తానే పరిచయం చేసుకొంది.

" నాపేరు విమల. మానాన్నగారు ఈకాలేజిలో కొత్తగావచ్చిన బాటనీ లెక్చరరు. డా॥ సత్యమిత్రగారు.'

అందరూ పరిచయాలు చేసుకొన్నారు.

ఆరోజు క్లాసులు లేవు.

ఒక్క అవరే జరిగింది. ఆ అవర్లోనైనా పాఠం ఏమీచెప్పలేదు.

అందరూ బొటనీకల్ గార్డెన్ అనబడే చెట్లకిందకి చేరారు. ఓ మామిడిచెట్టు, రెండువేపచెట్లు, ఆచివర ఓ తురాయి చెట్టు మధ్యలో నాలుగు కొబ్బరి చెట్లు - ఆ చెట్లకింద మధ్యలో రకరకాల మొక్కలు నాచుపట్టిన నీళ్లకుండీ, నాలుగు సిమ్మెంటు బెంచీలు. దీన్ని బొటానికల్ గార్డెన్ అంటుంటారు.

విమల తాతగారి పేరు జాగో గారట. అంటే జాగ్గరమూడి గోపాలం. ఆయిన నాస్తికుడు. కనుక పొడి అక్షరాలతో జాగో గానే ప్రసిద్దుడు. పెరియారు రామస్వామి, అబ్రహ్మాం కోవూర్, గోరా మొదలైన వాళ్లు ఆయిన స్నేహితులేనట . ఆయన భార్య గాయిత్రీ దేవి బొట్టు, గాజులు, మంగళ సూత్రాలు అన్నీ తీసేసిందట. మతాన్ని తీవ్రంగా నిరసించి ఆచరించే వ్యక్తిగా, చెప్పే ప్రతీమాటను తాను స్వయంగా పాటించి చూపిన వ్యక్తిగా ఆయనకు జనంలో గౌరవం వుంది. తనపిల్లలకు సంఘమిత్ర, సత్యమిత్ర, చైతన్య, సృజన అని పేర్లుపెట్టాడు. ఆయన్ని నెహ్రూగారు పార్లమెంటు మెంబరుగా నామినేటు చేస్తానంటే - వద్దని తిరస్కరించారట. రాజకీయాల్లోనూ వామపక్షాల భావాలుగల జాగోగారికి విప్లవవాదులు బూర్జువామేధావి అని కన్ ఫర్మిస్ట్, రిఫార్మిస్ట్ అని పేర్లు పెట్టారు.

ఆయన రెండోకొడుకైన సత్యమిత్ర తండ్రితో కొంతవరకూ విభేదించి విప్లవభావాల్ని సాయుధపోరాటాన్ని అంగీకరిస్తారట. ఎమర్జెన్సీరోజుల్లో జైలు శిక్ష అనుభవించి ఉద్యోగం కూడా పోగుట్టుకున్నాడు. జనతా పాలనలో తిరిగి ఉద్యోగం వచ్చింది.

విమల బొట్టుపెట్టుకోదు గాజులుండవు. జుత్తు కత్తిరించుకొంటుంది, ఆకర్షణీయమైన రంగురంగులబట్టలు కట్టుకోదు. సాదా తెల్లచీరకట్టుకొంటుంది. ఒక్కోసారి పంజాబీ డ్రస్సు లేదా షర్ట్, లాల్చీ తొడుక్కుంటుంది.

పక్కనేవున్న కాంటీమనుంచి టీలు తెప్పించుకొని తాగుతూ తోటలో కూర్చుని అంతా కబుర్లు చెప్పుకున్నారు.

" ఆడవాళ్లు మగవాళ్లకంటే ఏరంగంలోనూ తీసిపోరు. ఆసంగతిని మనతరం యువతులు మరింతగా నిరూపించాలి " అన్నది విమల.

కామేశ్వరికి విమల సంగతి ఏమీ నచ్చలేదు. అంతా బొత్తిగా విచ్చలవిడి తనంలా కనబడింది. మగరాయుడులా జుత్తు కత్తిరించుకోవడం అసలు నచ్చలేదు. కామేశ్వరి జట్టు చక్కగా వత్తుగా పొడవుగా వుంటుంది. అద్దంలో చూసుకొని ఎంత మురిసి పోతుందో -

మర్నాడు విమలతో మాట్లాడుతుంటే కామేశ్వరికి మంచి ఐడియా వచ్చింది. ఇంటికి తీసుకువెళ్లి తనస్నేహితులచేత ముఖ్యంగా విమలచేత తనకు సైకిలు చాలా అవసరమని వెంటనే కొనమని అమ్మకు నచ్చచెప్పిస్తే !?

ఓనాటి సాయంత్రం చంప, విమలా, మనోరమా శైలజా కామేశ్వరి ఇంటికి వెళ్ళారు. చంప, మనోరమా చెరో సైకిలు మీద వచ్చారు.

అంతా కామేశ్వరి తల్లిని అంటీ ఆంటీ అని పలకరించారు. కామేశ్వరి టీలు పెట్టి ఇచ్చింది అందరికీ.

"కామేశ్వరి సాయంత్రాలప్పుడు ఇంటికి ఆలస్యంగా వస్తుందంటున్నారుగా-సైకిలు కొనిపించండి. కాలేజీ వదిలాక ఐదంటే ఐదు నిముషాల్లో ఇంటి కొచ్చేస్తుంది. అంత దూరం నడిస్తే ఎంత నీరసం. ఎంత టైము వేస్టు"

"మీరీ మధ్య గమనించారో లేదో. కామేశ్వరి చాలా నీరసంగా ఉంటుంది. నడకవల్ల-మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రావడేం లేదు కనుక టిఫిను తెచ్చుకుంటుంది. ఆ టిఫినేమిటి చెప్పండి.? ఈ వయసులో పిల్లలు సుష్టుగా తివాలి"

"రేపు రాబోయే వాళ్ళాయిన, పిల్ల నీరసంగా ఉంది నాకొద్దు అన్నాడనుకోండి. అప్పుడేం జేస్తారు.? ఇప్పట్నుంచే కాస్త బాగా చూసుకుంటే బావుంటుంది. శరీరపోషణ ముఖ్యం కదా"

ఇలా అందరూ తలో మాటా అన్నారు.

"చాలా మంది ఆడపిల్లలు సైకిలు తొక్కుతున్నారు. ఈ రోజుల్లో కూడా ఇంత దూరం నడవడం అంటే అర్థం లేని పని. అయినా సైకిల్ తొక్కితే తప్పేంటి. ఈ రోజుల్లో స్త్రీలు............" అన్నది విమల.

చంప విమల్ని గిల్లింది. ఈ ధోరణి ఆపమన్నట్టు.

"మీరు చెప్పేది నిజమేనమ్మా. ఇంతకీ దానికి సైకిలు తొక్కడం రాదాయె. నేర్చుకున్నాకా అప్పుడు చూద్దాం-"

"వచ్చునాంటీ-మేం నేర్పేశాం-"

"ఏమిటీ సైకిల్ తొక్కడం నేర్చేసుకుందా-ఇహనేం దారిలో పడిపోయిందన్న మాటే-అయినా కాలేజీకి వెళ్ళి ఏమేమి చేసి వస్తుందో నేను చూడ వచ్చానా?"

"అదేమిటి అంటీ అలా అంటారు. కామూ తప్పేమీ చెయ్యలేదే-మేం అంతా సైకిళ్ళు తొక్కడం లేదా? శైలూ టీ.వి.యస్. అవలీలగా నడుపుతుంది. డ్రైవింగులో శైలూ ఎక్స్‌పర్ట్. అప్పుడప్పుడు చిన్న చిన్న ఫీట్స్ కూడా చేస్తుంటుంది"

"అలాగే లేమ్మా వాళ్ళ నాన్న గారితో చెబుతాను."

స్నేహితులు వెళ్లాక కామేశ్వరి మీద తిట్ల తుఫాను ప్రారంభమయ్యింది.

"ఎవత్తే అదీ జుట్టు కత్తిరించుకుని లాల్చీ, పంట్లాం వేసుకునీ-ఎవణ్ణో వెంటబెట్టుకుని వచ్చేవేమోనని హడలి పోయేను."–

"ఆడ పుట్టుక పుట్టలేదటే అదీ–"

"ఎటువంటి విపరీతాలు జరుగుతున్నాయీ–"

"ఎప్పుడు నేర్చుకున్నావు సైకిలు-నాతో ఒక్క నాడయినా చెప్పావా?" అని చెరిగేస్తోంది.

"చాన్నాళ్లయిందమ్మా నేర్చుకుని. చెబితే నువ్వు తిడతావని–" నీళ్లు నమిలింది కామేశ్వరి.

"నోర్మూయ్. ఎదురు సమాధానం చెబుతున్నావు. ఇంకానూ–చెబితే తిడతానని చెప్పలేదా"

"ఇంకా ఏమేమి నేర్చుకున్నావూ?" అని మళ్లీ మొదలపెట్టింది.

"నిన్ను పెద్ద చదువులు చదివించటం మాది తప్పు–"

"ఆడది పైట వేసుకోకుండా ఆడది పంట్లాం చొక్కా తొడుక్కోవడం ఏమిటీ? కొన్నాళ్లకి బట్టలు విప్పుకుని ఊరేగుతారుగావోసు. హవ్వ"

ఆ రాత్రి భోజనాల దగ్గిర పెద్ద యుద్ధం జరిగిపోయింది. సన్యాసిరావు మెతక మనిషి ఎటూ మాట్లాడ లేక పోయాడు. కామేశ్వరి ఏడుస్తూ కూచుంది. అన్నం తినలేదు.

మగపిల్లలిద్దరూ 'పోనీలెండి నాన్నగారు సైకిలు కొనండి అక్కకి' అన్నారు.

"సరే. కొంటాన్లే." అన్నాడు సన్యాసిరావు చివరికి. అన్నాడు గాని ఆ మాట మనస్ఫూర్తిగా అన్లేదు.

లీజర్ అవర్‌లో జనాలంతా కాంటీన్ దగ్గిర చేరారు.

"మనం ఒక చిన్న విజయం సాధించినట్టే." అన్నది చంప.

మొదటి రోజు సైకిలు మీద వచ్చి కామేశ్వరి, అందరికీ బిస్కట్లు, టీ యిప్పించింది.

"ఇంకో కొత్తసమస్య వచ్చిందే మనకి "

" ఏమిటి ?"

" ఉమా వాళ్ల అక్కకి పాలిటెక్నిక్ లోనూ, నర్స్ ట్రయినింగ్ లోనూ సీటు వచ్చిందట. ఇంట్లో దేనికీ పంపరట. టీచర్స్ ట్రయినింగ్ అయితే పంపుతారట. దాంట్లో సీటు రాలేదు. మనం వాళ్లింటికి వెళ్లి ఎలా అయినా నచ్చచెప్పాలే - "

" షూర్ - యివ్వాళ సాయంత్రమే వెళ్దాం" - అన్నది విమల.

ఈలోగా ఇంకో సంఘటన జరిగింది

కెమిస్ట్రీ తీరీ క్లాసు జరుగుతోంది.

కెమిస్ట్రీ మేడమ్ చాలా సీరియస్ గా " కైనటిక్ తీరీ ఆఫ్ గాసెస్ " గురించి పాఠం చెబుతోంది.

అటెండరు అనసూయమ్మ చీటీ పట్టుకొచ్చింది.

" చంపా సమ్ బడీ హాజ్ కమ్ ఫర్‌యూ - ప్లీజ్ గో" అనేసి పాఠంలో మునిగి పోయింది మేడం.

చంప గుండె గతుక్కుమంది. క్లాసుబయిట కొచ్చింది. దూరంగా కారిడార్‌లో అతను. అవును అతనే? ఇదేమిటిలా వచ్చాడు ?

గుండెలు వేగంగా కొట్టుకోనారంభించాయి. చాలా కంగారు పుట్టింది. ఇప్పుడేం చెయ్యడం ? ధైర్యం కూడగట్టుకోవడానికి ప్రయత్నించింది.

రంజన్ పీ.జీ సెంటర్‌లో ఎం.ఏ ఎకనమిక్స్ ఫైనలియర్ చదువుతున్నాడు. చంపతో కల్పించుకొని మాట్లాడుతూ వెంట వెంట పడుతున్నాడు. మనిషి బావుంటాడు. సిగరెట్లు కాలుస్తూ హీరో హోండా మీద తిరుగుతూ వుంటాడు. హీరో హోండా అంటే చంపకి చాలా ఇష్టం. కానీ సిగరెట్లు అంటే పరమ అసహ్యం.

" హల్లో గుడ్ మోణింగ్ - ఈ మధ్య మీరు కనపడటం మానేశారు. ఎక్కువ రోజులు మిమ్మల్ని చూడకుండా వుండలేక ఇలా వచ్చాను. " అంటూ ఏవేవో మాట్లాడాడు. ఎంత ధైర్యం ! దూరంనించి ఎవరెవరో ఇదంతా చూస్తూనే వున్నారు.

నీటుగా డ్రస్ చేసుకున్నాడు. జుట్టుగాలికి ఎగురుతోంది. ఒక్కక్షణం మనసు ఆకర్షణకు గురయ్యింది. కాని వెంటనే తమాయించుకుంది.

25164



" సారీ, ఇంకెప్పుడూ రాకండి, మా ప్రిన్స్‌పల్ కి తెలిసిందంటే చంపేస్తుంది" - అనేసి గబగబా క్లాసులోకి వచ్చేసింది.

ఇంటర్వెల్‌లో ప్రిన్స్‌పల్ నుంచి కబురు.

" పెద్ద మేడమ్ మిమ్మల్ని అర్జంటుగా తీసుకురమ్మన్నారు"అన్నది అనసూయమ్మ.

చంపకి పై ప్రాణాలు పైనే పోయాయి.

పావుగంట తరువాత తలవాచిపోయే తిట్లు తిని ఇవతలకి వచ్చింది.

" ఏం జరిగిందే ఏం జరిగిందే " అని స్నేహితులందరూ ఎంత అడిగినా చెప్పలేదు.

కాలేజీ నుంచి తొందరగా బయటపడి గుండె బరువు దించుకుందామంటే ఫిజిక్స్ ప్రాక్టికల్స్ . ప్రాక్టికల్స్ పాడు చేసింది.

ఫిజిక్స్ మేడమ్ తిట్టి పోసింది.

" సారీ మేడమ్ ఒంట్లో బాగోలేదు. హెవీ - హెడేక్ "

" దట్సాల్ రైట్ - ఆదివారం ఉదయం స్పెషల్ క్లాసుకి వచ్చి ఇదే ప్రాక్టికల్ రిపీట్ చెయ్యి."

చంపకి ఏడుపొచ్చినంత పనయింది.

వారానికి ఒకే ఒక్క ఆదివారం. ఆ ఒక్క ఆదివారం ఇలా స్పెషల్ క్లాసులనీ, ప్రాక్టికల్స్‌నీ ఖర్చయి పోతే ఇహ ప్రాణానికి విశ్రాంతి ఎప్పుడూ ?

ఆ బి.ఎ, బి.కాం వాళ్లకి ఎంత హాయి !

మర్నాడు ఈ సంగతి అందరితో చెప్పింది. ఆఖరి పిరియడ్ లేని మూలాన అంతా శైలజా వాళ్లింటి డాబా మీదకు చేరారు.

"మొదటిది రంజన్ అలా రాకూడదు. రెండోది ప్రిన్స్‌పల్ అలా పిలిపించి తిట్టకూడదు. కాలేజీకి సంబంధం లేని పర్సనల్ ఎఫైయిర్స్‌లో ప్రిన్స్‌పల్ తలదూర్చకూడదు " అన్నది విమల.

"మనందరం కలసి వాడికి గట్టిగా బుద్ధిచెప్పాలి."

" ఇంతకీ అతనంటే చంపకి ఇష్టం ఉందేమో - "

" ఛీ పాడు. నువ్వు మరీను - నాకిష్టం లేదు."

" వాడెవడో నావెంటపడుతున్నాడు. మీరే యాక్షన్ తీసుకోండని పెద్దమేడమ్‌తో ఎందుకు చెప్పలేదూ"-

"మా బావనని చెప్పాడటే "

" పాపం నువ్వంటే చాలా యిష్టం గావునే"

" నోరుముయ్యి , నోటి కొచ్చినట్టు వాగేవంటే నీ రెండు జడలూ కత్తిరించేస్తాను - "

" ఈ సారి అతను కలిస్తే నువ్వు గట్టిగా చెప్పేసెయ్ చంపా. నువ్వంటే నాకిష్టం లేదు. నావెంట పడకు. ఈ సారి వెంట పడితే వాళ్ల పీజీ సెంటర్ డైరక్టరుకీ , పోలీసులకీ కూడా రిపోర్టిస్తానని చెప్పు - అన్నది విమల.

ఇంకో విషయం కూడా లేవనెత్తింది, విమల

" మన కోసం అక్కో, తమ్ముడో, లేక నిజంగానే బావో, బాయిఫ్రెండో వచ్చాడనుకో అలా తిట్టడమేనా? పెద్ద మేడంతో ఈ సంగతి తేల్చుకోవాలి. రేపు మన క్లాసు రిప్రజెంటేటివ్‌లనీ, సెక్రటరీనీ సమావేశ పరచాలి. ఈ పంగతి డిస్కస్ చేద్దాం" అన్నది.

ఆ రోజుకి ఎవరింటికి వాళ్లు వెళ్లారు.

మర్నాడు క్లాసు రిప్రజెంటేటివ్‌తోనూ, సెక్రటరీతోనూ మాట్టాడారు. అంతా చాలా నిస్సహాయంగా మాట్టాడేరు.

" అయినా అలా విమెన్స్ కాలేజీకి మగవాళ్లు రావడం తప్పేకాదూ" అంది వాళ్ల క్లాసు రిప్రజెంటేటివ్.

ఈ ప్రపంచంలో ఆడామగా అంతా కలిసే పుట్టారు. కలిసే చస్తున్నారు. మగాడు ఆడదాన్ని పలకరిస్తే అదేదో తప్పని మాటాడ్డం ఘోరం . నువ్వు ఆడ పుట్టుక పుట్టి అలా మాట్లాడుతున్న నేమిటి?" అని నిలదీసింది విమల.

"మీరు చెప్పింది ఆదర్శ సమాజం వచ్చినపుడు. ప్రస్తుత పరిస్థితుల్లోన్నా అది తప్పే. అందుకే విమెన్ కాలేజీలు వేరే పెట్టారు" అంది సెక్రటరీ.

" నన్నడిగితే విమెన్స్‌కాలేజీలు ఇలా సెపరేట్‌గా పెట్టడం తప్పు -" అని ప్రారంభించింది విమల.

" మగవాళ్ల కాలేజీలో చదివితే ఇంకేమన్నావుందా హమ్మో " అంది కామేశ్వరి.

" ఏం నిన్ను కొరుక్కు తినేస్తారా ?" అన్నది మనోరమ. సంభాషణ చివరికి గందరగోళంగా తయారయింది.

విమలకి వొళ్ళు మండిపోయింది.

"సరే సెక్రటరీకి చాత కాకపోతే నోరు మూసుకుని ఊరుకోమను. కనీసం మీరు నలుగురు సపోర్టు చేస్తే నేను పెద్ద మేడంని అడుగుతాను -"

" ఏమని అడుగుతావు? మా కోసం రోజుకో మగాడు వచ్చినా మీరేం అనకూడదు అంటావా ?"

" ఛీ ఛీ మీకు ఎలా చెప్పాలో తెలీడం లేదు. మిమ్మల్ని అనవలసిన పనిలేదు. మిమ్మల్నిలా పెంచిన మీ తల్లిదండ్రుల్ని అనాలి. యీ సమాజాన్ననాలి."

"మధ్యన వాళ్లేం చేశారు. పెద్ద వాళ్ళనేమన్నా అంటే ఊరుకునేది లేదు-"

తగువు పెద్దదైపోయింది క్రమంగా.

చంప కల్పించుకుని-" అబ్బ వూరుకోండే తల్లీ యీ గొడవ యింతటితో ఆపండి అన్నది.

"విమలా-యీసారికి ఊరుకో. మరో సారి ఇటువంటి సంఘటన జరిగితే అప్పుడు గట్టిగా ఆలోచిద్దాం' అన్నది శైలజ.

విమల చాలా కోపంగా వుంది.

చంప విమలని దూరంగా లాక్కొచ్చింది.

కామేశ్వరి ఇందాకే ఊరుకుంది.

విమల చంపా వాళ్ళింటికి వెళ్ళింది.

డాబా పిట్టగోడమీద కూర్చున్నారు ఇద్దరూ. కొబ్బరి చెట్టు ఆకులమీంచి పిల్లగాలి రెపరెపలాడుతోంది. " చంపా నా ఆవేదన కాస్త అర్థం చేసుకో. ఇవి చిన్న విషయాల్లా కనపడతాయి, కాని ఇవే మన స్త్రీత్వాన్ని దెబ్బతీసే అంశాలు. నీకు రంజన్ అంటే ఇష్టం వుందనుకో.అతను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడనుకో, నీతో మాట్లాడ్డానికి రావడం తప్పా?

" తప్పుకాదనుకో - "

" మరి - ? ఈ పురుష ప్రపంచం ఎంత ఘోరంగా మనందర్నీ తయారు చేసిందంటే మన గొంతుల్నీ మనమే పిసుక్కునేలా తయారు చేసింది. తల్లే కూతుర్ని నానాతిట్లుతిడుతుంది. ఘోరమైన భావాలన్నీ మనలో ప్రవేశపెట్టి పాడు చేస్తారు. ఏంకొంచెం అర్థంచేసుకోరు. మనకూ వయసొచ్చింది. మనకూ వయసు కనుకూలమైన భావాలున్నాయని గుర్తించరు. సానుభూతి చూపరు. వరకట్నపు చావుల్లో ఆడపిల్లల్ని ఎవరు చంపుతున్నారు? ఎక్కువ సందర్భాల్లో ఆడపడుచులూ, అత్తలూ కిరసనాయిలు పోసి చంపుతున్నారు. మగవాళ్ళు వాళ్లని చాలా తెలివిగా ప్రేరేపిస్తున్నారు. నువ్వే ఆలోచించు చంపా"

" నిజమే - "

"చిన్నప్పటినుంచి మన తల్లిదండ్రులు మనల్ని ఎంత వివక్షతో పెంచుతున్నారు ? జుట్టు దగ్గరనుంచి, బొట్టు దగ్గర్నించి కట్టుకునే బట్టల దగ్గర్నించి వేరుగా వుంచుతున్నారు శారీరకంగా వేరుగా పుట్టడం వేరు. సామాజికంగా వేరుగా వుండడం వేరు చంపా. ఆడవాళ్ల చదువేమిటి? హోమ్ సైన్స్, నర్సింగ్, స్టిచ్చింగ్, టెలిఫోన్ ఆపరేటర్, మెడిసన్, టైపు, షార్టుహాండ్ ఇవేగా ? ఇంజనీరింగు లో ఎందరాడపిల్లలున్నారు చెప్పు ? సైంటిస్టులుగా ఎందరాడవాళ్లున్నారో చెప్పు - ప్రతీ రాష్ట్రంలోనూ మొత్తం ఎం.ఎల్. ఏ లలో ఆడవాళ్లెందరు ? పార్లమెంటులో ఆడవాళ్లెందరు ? ఎంత వివక్ష ఎంత పక్షపాతం - "

"నిజమే లోకం అలాగేవుంది, కాని ఏంచెయ్యడం ?

చాలా సేపటివరకూ ఇలా మాట్లాడి -

" నేను చెప్పినవన్నీ ఆలోచించు చంపా. మనం ఈ సంగతుల్ని అర్థం చేసుకోవాలి. తిరగబడాలి, లేకపోతే ఊబిలో కూరుకుపోతాం. విడిగా యేం చెయ్యలేం. కనుక మనం అందరం ఐకమత్యంగా వుండి యే సమస్యనయినా ఎదుర్కొందాం. దేనికయినాముందు మన అవగాహనాశక్తిని పెంచుకోవాలి. ప్రతి చిన్న సమస్యని అన్ని కోణాల్నించీ సమగ్రంగా అధ్యయనం చెయ్యాలి. ఆలోచన, అవగాహన, అధ్యయనం - ఇవి ఉంటే ఆచరణ సులభమౌతుంది."

రోజులు వారాలుగా, వారాలు నెలలుగా మారిపోతున్నాయి.

ఒక ఆదివారం విమల, చంప, శైలజా, మనోరమా కలసి ఉమా వాళ్లింటికెళ్లారు. కామేశ్వరి రానని చెప్పేసింది.

ఉమా వాళ్ల అక్క పేరు సీతామహాలక్ష్మి, అంతా సీతా అనే పిలుస్తారు.

సీత తన బలవంతం మీద నర్సింగ్‌కు అప్లికేషను పెట్టిందట. పాలి టెక్నిక్ ఎంట్రన్స్‌కూ వెళ్లిందట. టీచర్స్ ట్రయినింగ్ ఎంట్రన్స్‌కూ వెళ్లిందట. ఇంట్లో ఏదీ వద్దంటున్నారట. పెళ్ళి సంబంధాలు చూస్తున్నారట.

" పెళ్ళి వద్దని ఎవరన్నారు? కాని మనం దాని కోసమే పుట్టినట్టు అదే జీవిత పరమావధి అయినట్టా మనల్ని ఆ బంధంలో ఇరికిస్తే ఎలా ?" అన్నది విమల.

సీత ఉమ కంటే బాగా జంకుమనిషి. ఉమ పాటి ధైర్యం కూడా లేదు. తండ్రి ఎదురుగా వెళ్ళి ఏమీ మాట్లాడలేదు. తల్లి దగ్గర మాత్రం గొణుగుతుంది.

" స్త్రీ ఆర్థికంగా బలంగా, స్వయంపోషకంగా ఉన్నప్పుడు మాత్రమే పురుషుల దౌర్జన్నాన్ని ఎదిరించి నిలబడగలుగుతుంది. పురుషుడు అన్యాయం చేసినా తన కాళ్ళమీద తాను నిలబడగలుగుతుంది, కనుక ఉద్యోగం చాలా అవసరం."

"నర్సింగ్, పాలిటెక్నిక్ ఈ రెండింటిలోనూ ఏది నీకు యిష్టం.?"

" నర్సింగ్ యిష్టం."

" నర్సులయితే రోగుల దగ్గర వుండాలనీ, రాత్రిళ్ళుకూడా డ్యూటీ చెయ్యాలనీ, ప్రతీ డాక్టరు వెధవా నర్సులతో సరసాలాడేవాడేనని నర్సింగ్‌కు వెళ్లద్దంటుంది మా అమ్మ. పాలిటెక్నిక్ చదివి ఇంజనీరింగ్ సైడు ఇదేంపని చేస్తుందీ, వద్దంటున్నారు మానాన్న. ఇప్పుడెలాగ ? " అన్నది ఉమ.

" ఆ మాటల్లో కొంత నిజం లేకపోలేదు. నర్సులంటే తమ ఉంపుడుగత్తెలనుకునే డాక్టర్లే ఎక్కువ. ఈ సమస్య మీద గుంటూరులో ఒక నర్స్ ఆత్మహత్య చేసుకొన్న సంగతి మనం విన్నాంకదా. నర్సులేమిటి? లేడీ డాక్టర్లపట్ల కూడా అలాగే వుంటారు. ఆ మధ్య కాకినాడ మెడికల్ కాలేజిలో ఏం జరిగిందో పేపర్లో చదివేం. అయితే ఎవరు మట్టుకు వాళ్లు అలా అనుకుంటే ఆ ఉద్యోగాలకు ఎవరు ముందుకు వస్తారు. నిజంగా మానవజాతికి సేవచేసే అవకాశం వైద్యవృత్తిలోనే ఎక్కువవుంది. ఇక ఇంజనీరింగ్ సంగతి, ఆడవాళ్లు దానికి పనికిరారంటే మాత్రం ఒప్పుకోను. మగవాళ్లు మనకంటే ఎక్కువేంకాదు. ఇల్లు కట్టడంలోనూ,

రాళ్ళువెయ్యడంలోనూ ఆడవాళ్లు ఎంత కష్టపడుతున్నారు? మగవాళ్లు ఓదగ్గర కూర్చుని తాపీ పట్టుకుంటారు. నేర్చుకుంటే తాపీ పని కూడ ఆడవాళ్లు చెయ్యగలరు."

" నాకు ఆడవాళ్ళు తాపీపని చెయ్యడం చూడాలని వుందే " అన్నది శైలజ.

" ఎవరో చేస్తే చూడడం దేనికి నువ్వే నేర్చుకో - "

" ఏంతప్పా ?"

" తప్పని నేనన్నానా?"

" సరే - యింత కష్టపడినా ఆడవాళ్ళకి మగవాళ్ల కంటే తక్కువ డబ్బులే యిస్తారు. ఇది అన్యాయం కదూ - ఆ విషయం అలా వుంచితే ఇంజనీరింగ్ కు ఆడవాళ్ళు పనికి రారంటే నేను ఒప్పుకోను - "

" పోనీ ఆ టీచర్స్ ట్రయినింగ్ సీటు వచ్చినా బాగుణ్ను" అన్నది సీత.

" మొన్న చెప్పాను కదూ చంపా నీకు - ఆడవాళ్లకి కొన్ని ఉద్యోగాలుంటాయి. టైపిస్టు, నర్సు, టెలిఫోన్ ఆపరేటర్, టీచర్, ఎయిర్ హోస్టస్ - ఇలాంటి ఉద్యోగాలే ఆడవాళ్లకి. చదువులు కూడా అందుకు తగినట్టే ఏర్పాటు చేశారు. ఏం హోంసైన్స్ మగవాళ్లు ఎందుకు చదవకూడదు?

"సీతా నువ్వు పాలిటెక్నిక్ కే వెళ్లు - "

" ష్ - మా నాన్నగారు వస్తున్నారు " - అన్నది ఉమ.

అందరి నోళ్ళూ టక్కున ఆగిపోయేయి. విమలకి చాలా వింతగా తోచింది.

మగవాళ్లని చూసి టక్కున భయపడి నోరు మూసుకోవడం విమలకి అర్థంకాదు . ఆమె పెంపకం అటువంటిది.

" ఏమిటి మీ స్నేహితులంతా ఒక్కదగ్గరే చేరినట్టున్నారు." అన్నాడు ఉమ తండ్రి. ఆమాటల్లో కొంత వెటకారం ధ్వనించింది.

" ఏం లేదు ఆదివారం కదాని "-

" సీతకి పాలీటెక్నిక్ సీటువచ్చిందిదట కదండీ." అని ప్రారంభించింది విమల. తక్కిన వాళ్లకి భయం వేసింది.

"అవునమ్మా"

"ఎప్పుడు వెళ్తుందీ?"

"ఆఁ దాని మొహం - అదేం చదువుతుందీ,పాలిటెక్నిక్ ? టీచర్స్‌ట్రయినింగ్ సీటు రాలేదు.వస్తే..."

" రాని దానికోసం బాధపడి ప్రయోజనం ఏముంది వచ్చింది వదులుకోకుండా -"

" అవునంకుల్, సీతని పాలిటెక్నిక్‌కి పంపించెయ్యండి. ఈరోజుల్లో కొందరమ్మాయిలు పాలిటెక్నిక్కూ ఇంజనీరింగూ చదువుతున్నారు ."

" నిజమేనమ్మా - పైవూరు వెళ్ళి చదవగలదా అని - "

" ముందు కొంచెం కొత్తగా వున్నా, తరువాత అదే అలవాటు అవుతుంది."

" అవునండి, ఒంటరిగా ప్రయాణం చెయ్యడం, ఒంటరిగా చదువుకోవడం అలవాటు చెయ్యాలి, లేకపోతే ఎప్పటికీ జంకూ పిరికితనమూ పోవు - "

" చాల్లే ఒంటరిగా సినిమాకు వెళ్ళడానికే భయం సీతకి," అన్నది లోపలినుంచి వాళ్లమ్మ .

" మీరు పంపి చూడండి ఆంటీ ఎందుకు వెళ్లలేదో -"

" అదేమో నర్సింగుకు వెళతానంటే - మీరంతా పాలిటెక్నిక్ అంటారేమిటి? ఏమో అది నర్సింగ్‌కు వెళ్ళాలని వుందనికదే నీతో చెప్పిందన్నావు- " అనడిగాడు తండ్రి తల్లిని -

" పోనీ - అదే - నర్సింగ్‌కే పంపండి."

" ఆలాగేనమ్మా, నాఅభ్యంతరం ఏమీ లేదు. కాని వాళ్లమ్మ.... "

"పరువుగల ఆడదెవత్తీ గొన్సుతొడుక్కుని రోగిష్టి వాళ్ల దగ్గిర, మొగ డాక్టర్ల దగ్గిరా నర్సుద్యోగం చెయ్యదు. నేను చచ్చినా ఒప్పుకోను, నా బిడ్డ ఆ దిక్కుమాలిన ఉద్యోగం చెయ్యడం నేను సహించలేను" అని ఖచ్చితంగా చెప్పేసింది తల్లి.

" అదేమిటి ఆంటీ అలా అంటారు, నర్సుద్యోగం చేసే వాళ్ళంతా పరువుతక్కువ వాళ్లేనంటారా ?"

" కాకపోతే? "

ఫ్రెండ్స్‌లో ఈ విషయం మీద చాలా చర్చ ప్రారంభమయింది.

" మీరలా మాట్లాడ్డం ఏమీ బాగోలేదు" అని లేచింది విమల. పక్కనున్న చంప విమల్ని చెయ్యి పట్టుకుగుంజింది. తగువుకు దిగితే అసలు చేడుతుందని చెవిలో గొణగింది. విమల గ్రహించి ధోరణి మార్చింది. నచ్చ చెప్పినట్టు చాలాసేపు మాట్లాడింది. ఎంత చెప్పినా ఏమీ లాభంలేకపోయింది. కొందరి మనసులలో స్థిరపడిన భావాల్ని మార్చడం ఎవ్వరి తరమూ కాదు. సీత విషయంలో స్నేహితులందరూ కలసి చేసిన ప్రయత్నాలు కొంచెం కూడా కలసి రాలేదు.

ఇవతలికి వచ్చాక విమల ప్రారంభించింది.

" ఈ ఆడవాళ్లకి ఎక్కణ్ణించి చెప్పడం ప్రారంభిస్తే అర్థం అవుతుందో తెలియడం లేదు. పురుష ప్రపంచమే వాళ్లచేత అలా మాట్లాడిస్తుందని నాకు తెలుసు., కాని పురుషులు ఎలా మారతారిప్పుడు ? ఉత్పత్తి శక్తుల్లో, ఉత్పత్తి సంబంధాల్లో మార్పురావాలి. అవి మానవ సంబాంధాన్ని కూడా మారుస్తాయి. కాని ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు విప్లవం ద్వారా తప్పగాని సులభంగా సాధ్యంకావు" అని చిన్న ఉపన్యాసం దంచింది.

" విమలా మాకు కాస్త అర్థమయ్యేలా మాట్లాడు తల్లీ" అన్నది శైలజ.

చాలా సేపు కూర్చుని బోధపర్చింది గానీ, ఎవ్వరికీ ఒకముక్క అర్థంకాలేదు.

చంపా, శైలజా, మనోరమ కొత్తహిందీ సినిమా మోర్నింగ్ షోకి వెళ్లారు. విమల యింటికి వెళ్ళింది.

యింటికి వచ్చి తండ్రితో ఈ సంగతులన్ని చెప్పింది.

డా॥ సత్యమిత్ర ఓపిగ్గా విన్నాడు.

" నువ్వు వాళ్ళకి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు అని మొదలు పెడితే ఎలా అర్థం చేసుకొంటారు? చలం, కుటుంబరావు, రంగనాయకమ్మ - ఇలాంటి వాళ్లు రాసిన పుస్తకాలు చదివించు. కొంత వరకూ అర్థం కావచ్చు. వాటి మీద చర్చించాలి. నిత్యజీవితంలో జరిగే సంఘటనలతో అన్వయించి అర్థం చేసుకోండి" క్రమంగా మిగతా సంగతులు....- అని సలహా యిచ్చాడు.

ఈ మాట యింతకుముందు రెండు మూడుసార్లు చెప్పాడాయన. కాని విమల ఇటీవల చదివిన సిద్ధాంత గ్రంథాల్లోని మాటలే మాట్లాడ లేకుండా వుండలేకపోతుంది.

కూతురు ఆ వయసులోనే చాలా సంగతులు అర్థం చేసుకొన్నందుకు, యితరులకు చెప్పే ప్రయత్నం చేస్తున్నందుకు సంతోషించాడు డా॥ సత్యమిత్ర.

ఉపన్యాసాల ద్వారా మనుషుల్ని మార్చడం జరగని పని. కాని మొదట్లో ఉపన్యాసాల ద్వారానే ప్రారంభించక తప్పదు. దానికి ఆచరణ జోడించడం ఎంతయినా అవసరం.

కాలం ఉరకలు పరుగులు మీద గడిచి పోతోంది.

ఆ రోజు కాలేజీకి సెలవు.

అటెండరు అనసూయమ్మ చచ్చిపోయింది.

ఆత్మహత్య చేసుకొని చచ్చిపోయింది.

ఇతర లెక్చరర్లతో పాటు చంపా, విమలా, శైలజా, మనోరమా చూడ్డానికి వెళ్లారు. స్టూడెంట్స్ సెక్రటరీ కూడా వచ్చింది.

అనసూయమ్మకు నలభైఏళ్లు వుంటాయి, ముగ్గురు ఆడపిల్లలూ ఒక మగ పిల్లవాడు. పెద్దకూతురు పెద్దమనిషయి ఏడాదయింది. మొగుడు మోటారు మెకానిక్ షెడ్‌లో పనిచేస్తుంటాడు. కానీ రోజూ తాగివచ్చి నానా గందరగోళం చేస్తాడు. అనసూయమ్మ అలాగే భరిస్తుంది. ఇంటికి ఏమీ డబ్బులివ్వడట. ఎప్పుడైనా ఇచ్చినా బహు స్వల్పం.

అనసూయమ్మ తండ్రి గవర్నమెంటులో ఉద్యోగం చేస్తూ చచ్చిపోయాడు. ఒక్కర్తేకూతురు కనుక ఆమెకు ఈ ఉద్యోగం ఇచ్చారు. ఐదోక్లాసు చదువుకున్న అనసూయమ్మతెలివైందీ జాగ్రత్తయిందీను. చాలా నమ్మకమైన మనిషి అందరికీ ఆమెమీద సద్భావం ఉంది.

మొగుడు తాగి తందనాలాడుతుంటే తన జీతంతో ఇల్లు ఇల్లునడుపుకొస్తుంది అనసూయమ్మ. అయిదేళ్ల క్రితమే ఆపరేషన్ చేయించుకున్నాడు మొగుడు. ఈ మధ్య నెలతప్పిందట.

" ఎవరితో తిరిగి కడుపు చేయించుకున్నావే" అని నాలుగు రోజుల్నిచి చితక బాదుతున్నాడు .శారీరక, మానసిక చిత్రహింసలు తట్టుకోలేక ఎండ్రిన్ తాగి ఆత్మహత్య చేసుకొంది అనసూయమ్మ.

" అనసూయమ్మ అలాంటిది కాదు. చాలా మంచి మనిషి ఆయిల్లాలు యిన్నాళ్ళూ ఆడితో ఎలా కాపురం చేసిందో యేటో ఆభగవంతుడికే తెలియాలి" అన్నారు యిరుగు, పొరుగు అమ్మలక్కలు.

ఆగండడు తాగీసొచ్చి నానా కూతలుకూసి సుబ్రంగా కుళ్లబొడిసేసీవోడు. యిడతియ్యడానికి ఎల్లిన వోళ్లని కూడా తన్నేసేవోడు. ఆడికేం మాయరోగమో" అన్నాదొక ముసలమ్మ.

" చూసాశా చంపా, అనసూయమ్మ బ్రతుకెలాగయ్యిందో. ఆరాస్కెల్‌ని వదలకూడదు డి.ఎస్.పి ని కలిసి కంప్లయింటిద్దామా " - అన్నది విమల.

" అమ్మో పోలీసులే - " అన్నది మనోరమ.

ఆత్మహత్య కేసుకనుక పోలీసులొచ్చారట. మొగుణ్ణి తన్నుకుంటూ లాక్కెళ్ళారట.

" పోలీసులేటి జేస్తారమ్మ. నాల్రోజులు కొట్లో పడేసి తన్ని డబ్బుగుంజి ఒగ్గేస్తారు. మనకి తెలియని బాగోతమా - " అన్నాడొకతను.

" నా అనుమానం అనసూయమ్మ మొగుడు చేయించుకొన్న ఫామిలీ ప్లానింగ్ ఆపరేషను ఫెయిలయ్యిందేమో నని. లేకపోతే ఎందుకిలా జరుగుతుంది? ఫెయిలయ్యే అవకాశం లేకపోలేదు --" అన్నది జూవాలజీ మేడం.

విమలకి ఈ మాట నచ్చింది. అనసూయమ్మ మొగుణ్ణి మెడికల్ చెకప్ చేయిస్తే ఏసంగతీ తెలిసి పోతుంది. ఇక్కడవున్న జనంతో తనేం చెయ్యలేదు. వెంటనే విజయవాడ, గుంటూరులోని తనమిత్రులకి ఉత్తరాలు రాసింది. సత్యమిత్ర కూడా రాశాడు.

నాలుగోరోజున ఇద్దరు మొగవాళ్ళు ఇద్దరు ఆడవాళ్లు దిగారు. ఒకతని పేరు గోపాల్ విరసం సభ్యుడు. ఇంకోఅతను పేరు ప్రసాద్. కృష్ణాజిల్లా పౌరహక్కుల సంఘకార్యదర్శి. ఒకామె పేరు జయశ్రీ గుంటూరులో లాయరు. మరొక ఆమె పేరు హేమ. ప్రగతిశీల మహిళా సమాఖ్య కార్యకర్త.

ఈ నలుగురితో పాటు విమల, సత్యమిత్ర కూడా అనసూయమ్మ యింటికి వెళ్లారు. చాలా సేపు అన్ని సంగతులు అడిగి తెలుసుకొన్నారు. సత్యమిత్రగారింటికి వచ్చి చాలా సేపు చర్చించి కలెక్టరి కొక పిటీషన్ తయారు చేశారు. దాని కాపీ డిఎస్పికిక్కూడా ఇచ్చారు.

అనసూయమ్మ మొగుణ్ణి మెడికల్ చెకప్ చేయించాలి. ఆమె ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తిపై చట్టబద్ధమైన చర్యతీసుకోవాలి. అనసూయమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి అన్నవి వాళ్ల పిటీషన్‌లోని మూడు ప్రధాన అంశాలు, మూడు డిమాండ్స్.

ఇదంతా కనిపెట్టి అనసూయమ్మ మొగుడు పరారయ్యాడు. ఆ నలుగురూ ఊళ్లో చందాలు వసూలు చేసి దాదాపు పదిహేనువందల రూపాయిలు పోగుచేసి అనసూయమ్మ కుటుంబానికి తీసుకువెళ్ళి యిచ్చారు.

దాదాపు ఇరవై సంవత్సరాలు కాపురం చేసిన భార్యపై కూడా భర్తలు ఎటువంటి నిందలు వేసి హింసిస్తారో విమల తన స్నేహితురాళ్ళందరికీ వివరించింది.

విమల మాటలు యిప్పుడిప్పుడే వాళ్ళకి అర్థం కానారంభించాయి. చంపా వాళ్ళ వీధిలో ఒకతగువు జరిగింది. నారాయణమ్మ మొగుడు చాలా మెతక, నారాయణమ్మ అందగత్తె కాదు. కాని ఎరుపు. మొగ పిచ్చి ఎక్కువట. మొగుడికి అన్నీ తెలిసినా ఏమీ అనలేకపోయేవాడు. బిడ్డల తల్లి అయినా ఆ గుణంలో మార్పు లేదా. అత్త పరమ చచ్చు. పైగా ఆమెకి రేజీకటి. చివరికి ఒక రోజు నారాయణమ్మని మొగుడు నిలదీశాడు. ఫలానావాడి తో తిరగడం వీధివీధంతా పబ్లికయిపోయాక నిలదీశాడు. నారాయణమ్మ మొగుణ్ని ఎదిరించింది. నాకే పాపం తెలియదంది. బిడ్డలమీద వొట్లు వేసింది. ఈ కథ విన్న చంపకి తల తిరిగిపోయింది. దీనికి పురుషభావజాలమే కారణమంటోంది వ్యభిచార భావం పురుషుల విచ్చలవిడితనంలోంచి వచ్చిన భావం. నేరం స్త్రీ లదే అయినా ఆ వెనక నున్న పురుషాధిపత్య భావజాలమే అంటుంది విమల. చంపకి అర్థం కావడం లేదు.

* * *

మనోరమ ప్రిన్సిపల్ ను చూసి ఆశ్చర్యపోయింది. వెంటనే అందరితోనూ చెప్పింది.

" పెద్ద మేడమ్ కళ్లువాచిపోయి ఎర్రగా వున్నాయి. రాత్రి తెల్లవార్లూ నిద్రలేకుండా ఏడిచి వుండొచ్చు.' "అన్నది. మర్నాటికి స్నేహితులందరూ కలిసి చాలా సమాచారం సేకరించారు. తండ్రి ద్వారా విమల కొంత సమాచారం సేకరించింది.

ప్రిన్సిపల్ సుందరమ్మ భర్త మాజీ మిలటరీ ఆఫీసరు. సుమారు పదేళ్ళయి యీమెని వొదిలేసి మద్రాసులో ఇంకొక ఆమెతో వుంటున్నాడు. రెండు మూడు నెలలు కొకసారి వచ్చి నానా గొడవచేసి రెండేసి వేలు, మూడేసి వేలు పట్టుకుపోతుంటాడు ఇద్దరు పిల్లలు, మొగపిల్లవాడు విశాఖపట్నం పోర్టు ట్రస్టులో ఉద్యోగం చేస్తున్నాడు, ఆడపిల్ల గరల్స్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతుంది.

ఆ ఆడపిల్ల తనకి పుట్టింది కాదని ఆయన నమ్మకం. అందుకే వొదిలేసి మద్రాసులో ఇంకొకామెతో వుంటున్నాడు పదమూడు సంవత్సరాలు మిలటరీలో పనిచేశాడు. వెయ్యి రూపాయల వరకు పెన్షన్ వస్తుంది. గుర్రప్పందాలకీ, తాగుడుకూ ఆ డబ్బు చాలదు. భార్య దగ్గరికి వచ్చి రెండేసి వేలు, మూడేసి వేలు పట్టుకుపోతూంటాడు.

"ఇంక నేను ఇవ్వలేను. కూతుర్ని చదివించుకోవాలి. పెళ్ళి చెయ్యాలి నాలుగు రాళ్ళు కూడ బెట్టాలి. ఇంక నాయింటి గడప తొక్కద్దు. వెళ్ళిపొండి" అని సుందరమ్మ ఖచ్చితంగా చెప్పేసింది. మొహం మీదనే తలుపు వేసేసింది.

కాని వినడు. వేధిస్తున్నాడు.

తన భర్త మద్రాసులో వ్యాపారం చేస్తుంటాడని అందరితో చెపుంతుంటుంది. భర్త అప్పుడప్పుడు వస్తున్నందుకు ,నలుగురికీ కనబడుతున్నందుకూ సుందరమ్మ ఒకరకంగా సంతోషిస్తుంది. కాని తరుచుగా ఎదురయ్యే ఈ హింస, ఈ దోపిడీ తట్టుకోలేకపోతుంది. కాని భరించక తప్పడం లేదు. మరోదారి లేదు. డబ్బు యివ్వనంటే ఇచ్చేవరకూ కొడతాడట. ఇరుగు, పొరుగు వినేలాగా నానా కూతలూ కూస్తాడట. గాజులూ, మెళ్లో గొలుసూ లాక్కుపోయాడట. ఎదుగుతున్న కూతురు భయంతో జడిసి పోతుంటుంది. ఇదంతా ఎందుకు జరుగుతుందో పూర్తిగా అర్థం చేసుకోలేని వయసు పాపం ఆ చిన్న పిల్లకి.

స్నేహితులందరూ చాలా బాధ పడ్డారు.

"యింటికి వెళ్ళి మేడం గార్ని కలిసి మనసానుభూతి తెలియపరుద్దామా – పాపం" అన్నది చంప కానీ – ఆమె ఏమనుకుంటుందో.

" తన సంగతి స్టూడెంట్లమైన మనకి కూడా తెలసి పోయినందుకు చాలా బాధ పడుతుంది. గాయపడుతుంది" అన్నది శైలజ.

" ఇంత చదువుకుని, ఇంత హోదా అయిన పెద్ద ఉద్యోగం చేస్తూ, ఈ వయసులో వున్న మేడంకి కూడా ఈ కష్టాలేమిటి.? ఆశ్చర్యంగా వుంది" అన్నది మనోరమ.

" ఆడదై పుట్టినందుకు, దేశానికి ప్రధానమంత్రి పదవిలో వున్నా రాజకీయ నాయకులందర్ని హడలెత్తించినా, కొడుకు చేత తన్నులు తినడం తప్పలేదు - ఇంతకంటే ఘోరం యింకే యేమన్నా వుంటుందా?' అన్నది విమల.

" ఆడదై పుట్టేకంటే అడవిలో మానై పుట్టడం మేలంటారు అందుకే"

" ఆదిమ సమాజంలో స్త్రీ , పురుషులు మధ్య ఈ వివక్షలేవీ వుండేవికావు. సమానంగా కష్టపడేవారు, సమానంగా అనుభవించేవారు. వేట చేపలు పట్టడం అప్పటి ప్రధాన వ్యవసాయం కనిపెట్టాకనే ఈ కష్టాలు మొదలయినట్టున్నాయి. ఈ వ్యవసాయాన్ని కనిపెట్టిందిస్త్రీయే. వృత్తులు ఆతరువాత క్రమంగా మాతృస్వామ్యంపోయి....'

" మాతృస్వామ్యంఅంటే? "

" తల్లి– అంటే స్త్రీ– యింటికి యజమానురాలుగా వుండే వ్యవస్థ- మొత్తం సమాజంలో ఆమెదే యాజమాన్య స్థాయి. అదిపోయి పితృస్వామ్య వ్యవస్థవచ్చింది. అంటే తండ్రి యింటికి యజమాని అన్నమాట. అప్పటినుంచి రానురాను స్త్రీ పరిస్థితి ఘోరమైపోయింది. బానిసవ్యవస్థ ఏర్పడినప్పుడు తొలిబానిసలు స్త్రీలే-"

" బానిస వ్యవస్థ అంటే ఏమిటో నాకు అస్సలు తేలీదు,"

" యుద్ధంలో ఓడిపోయిన మగవాళ్ళ దొరికినప్పుడు.

చంపేసే వారట. కుటుంబం లేదా బానిసలుగా చేసుకునేవారట. ఎప్పుడు తయారయిందో ఆడదాని బ్రతుకు అప్పుడే దుర్భరమైపోయింది. తండ్రి యజమాని. తక్కిన వాళ్లంతా బానిసలే. స్వంత ఆస్తి దీనికి మూలకారణం. నాభార్యను నేను చంపుతాను, నరుకుతాను నా యిష్టం నువ్వెవరివి నన్నడగడానికి అంటుంటారు విన్నారా ? అలాగే ఇరుగు, పొరుగు అమ్మలక్కలు దెబ్బలాడుకొని ఆ కోపంలో పిల్లల్ని బాదేస్తారు. నాబిడ్డ నాయిష్టం, కొట్టుకుంటాను, పెట్టుకుంటాను, చంపుకుంటాను. నువ్వెవరు మధ్య అడగడానికి అంటారు."

" అవునే మేం నెల్లూరులో వుండేటప్పుడు మా పొరుగావిడ అచ్చం అలాగే అనేది కోపం వచ్చినప్పుడల్లా పిల్లల్ని చావబాదేసిది. పిల్లలకి ఏం పెట్టేదో తెలియదు కాని కొట్టడం మాత్రం బాగా కొట్టేది.

" వ్యవసాయానికి , పరిశ్రమలకి మనుషులు అవసరం వుంటారుకదా. అంటే వాళ్లశ్రమతో ఆ పనులన్నీ చేయించుకొని ఉత్పత్తులు సాధించేవారు. మరి ఆఉత్పత్తుల్ని తయారుచేసే మనుషుల్నికని ఉత్పత్తి చేసేది స్త్రీయేకదా. అంచేత ఆ స్త్రీపైకూడా దోపిడి చెలాయించేది ఈ దోపిడీ పురుష ప్రపంచమే. అందుకే విడిపోయేటప్పుడు పిల్లల్ని తీసుకునే హక్కు పురుషుడే వుంచుకుంటాడు, యిప్పుడు రకరకాల చట్టాలు వచ్చి వుండొచ్చు, కాని క్రియచేత జరిగేది అదే -"

" మా బంధువుల్లో ఒకామెకి బలవంతాన విడాకులిచ్చాడు వాళ్లాయన. కూతుర్ని ఆమెకు వదిలేసి కొడుకులిద్దర్ని తనే తీసుకొన్నాడు. ఈసంగతి మా అమ్మ చెప్పినప్పుడు నాకు చాలా కష్టం వేసింది."

" మరి పుట్టుకతోనే స్త్రీ పురుషులు వేరువేరు కదా సమానం కావడం ఎలాగ? అంటే అది వేరే ప్రశ్న- ఫిమేల్ సెక్స్ , మేల్ సెక్స్వుండటం వేరు. ఈ సమాజంలో స్త్రీలూ పురుషులుగా వుండటంవేరు. ప్రస్తుత సమాజనీతి స్త్రీ పురుషుల్ని అన్నివిధాలా వేరు చేసింది. స్త్రీని పురుషుడికి లొంగివుండేలా చేసింది. శారీరకంగా

వేరయినా పుట్టుక నుంచీ సమానంగా పెంచితే స్త్రీ పురుషుడికి ఎందులోనూ తీసిపోదు. ఆమె పుట్టినప్పటినుంచీ మానసికంగా నువ్వు ఆడదానివి, అబలవి, సుకుమారివి. పురుషుడు బలవంతుడు, గొప్పవాడు, యజమాని అని నూరి పోస్తారు. నవ్వనివ్వరు, పరుగెత్తనివ్వరు. సమానంగా తిరగనివ్వరు, చదువుకోనివ్వరు, సమాన ఉద్యోగాలు చెయ్యనివ్వరు. శారీరకంగా పురుషుడికంటే స్త్రీ పొడవుగా ఉంటే ఒప్పుకోరు. మొగుడు కంటే పెళ్లాం ఎప్పుడూ పొట్టిగా వుండాలి. లేకపోతే పొడవుగా గెడకర్రలాగ వున్నావని వెక్కిరిస్తారు."

" మా బాబాయి కంటే మాపిన్ని ఓ అరంగుళం పొడవే. అందరూ పొట్టి మొగుడూ పొడవు పెళ్ళాం అని వెక్కిరిస్తారు".

" ఆడపిల్లని ఏ వ్యాయామం చెయ్యనివ్వరు. ఏఆటలూ ఆడుకోనివ్వరు. ఘోరమైన ఇంటిచాకిరి, వంట, అంట్లుతోమడం."

" వంటచేస్తాను కాని అంట్లుతోమడం అంటేనాకు పరమ అసహ్యం చేతులు కొట్టుకుపోతాయి."

" ఇల్లుతుడవడం, బట్టలుతకడం, నవమాసాలు కడుపుతో వుండి కనడం ఆతరువాత ఆ పిల్లల్తో యాతన - వాళ్లు బట్టల్లో దొడ్లోకి వెళ్తారు, ఉచ్చలు పోస్తారు. అవన్నీ ఎత్తి పొయ్యాలి - ఈ పనుల్లోస్త్రీ శారీరకంగా మానసికంగా కుంగిపోతుంది- అందుకే మానాన్నగారు పదేపదే చెబుతుంటారు - ఆడవాళ్లు పుట్టరు - .ఈ సంఘంవాళ్లనిలా తయారు చేస్తుంది. శరీర లక్షణాలు వేరు కనుక కనకపోవచ్చుగాని- అంట్లుతోమడం సంవత్సరం లోపు పిల్ల ఉచ్చ, దొడ్డికి కూడా ఎత్తుతూ పెంచడం - పురుషులుకూడా చేస్తే స్త్రీకి రిలీఫ్. ఏదో రెండురోజులు చెయ్యడంకాదు ఒకబాధ్యతగా చెయ్యాలి."

" రేపు మా అత్తయ్య విజయవాడనుంచి వస్తుంది మీకు పరిచయం చేస్తాను - ఈ విషయాలు నాకంటే బాగా చెబుతుంది. ఆమె చాలా కాలంగా ప్రగతిశీల మహిళా సంఘంలోనూ తదితర మహిళా సంఘాల్లోనూ పనిచేస్తుంది. చాలా అనుభవమున్న వ్యక్తి" అన్నది విమల.

స్పజన విజయవాడలో ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరరు. భర్త ప్రైవేటు డాక్టరు. స్పజన డా॥ సత్యమిత్ర చెల్లెలు.ఆమె ఒక మహిళా కార్యకర్త కూడాను. ఈ మధ్య పౌరహక్కుల సంఘంలో కూడా సభ్యత్వంతీసుకొంది. భారత నాస్తిక సమాజంలోకూడా సభ్యురాలే. మర్నాడు రైల్లో స్పజన వచ్చింది. వస్తూనే–

'ఆ మధ్య నువ్వు ఉత్తరం రాశావు. మీ కాలేజీలో ఎవరో అటెండరు అనసూయమ్మ ఆత్మహత్య చేసుకుంది అని వ్రాశావు. నేను రాలేకపోయాను. అదిలాబాద్ ఆదివాసి గిరిజన స్త్రీలసమస్యలపై సదస్సు జరుగుతుంటే అక్కడికి వెళ్లాను. ఇంతకీ ఆమె సంగతి ఏమయ్యింది.?' అనడిగింది.

" ఏమీకాలేదు. మేము పోలీసు రిపోర్టు యిచ్చాం భర్త పరారయ్యాడు. పెన్షన్ పేపర్లు కదిలించాలని చూశాం. మొగుడు పారి పోయాడు. పిల్లలు మైనర్లు. లీగల్‌గా చాలా చిక్కులు వచ్చాయి "

" మరి జయశ్రీ గారికి రాయలేకపోయావా ?"

" రాశాను . కొన్ని అర్జెంటు పనులు ఉన్నాయట. వచ్చేనెల మొదటివారంలో తప్పకుండా వస్తామని రాశారు. అన్నట్టు సాయంత్రం స్నేహితులు వస్తామని అన్నారు. నిన్ను చాలా సంగతులు అడిగి తెలుసుకుంటారట వాళ్ళ బుర్రలనిండా లక్షా తొంభై అనుమానాలు".

" చాలా కాలమైంది. మీఅందర్ని ఒకేసారి చూసిపోదామని వచ్చాను సాయంత్రం బండికి వెళ్ళిపోదామనుకుంటున్నాను."

" ఇవ్వాల్టికి ఉండత్తా . రేపు వెధుదువుగాని ఎప్పుడోగాని రావు "-

" నాకు రేపు చాలా పన్లున్నాయి"-

" ఎప్పుడూ ఉండేపనులేకదా - ప్లీజ్ అత్తయ్యా "-

" సర్లే వుంటానులే ఈమధ్య మీనాన్న కొత్తపుస్తకాలు ఏమన్నాతెచ్చాడా ? లేదా?"

" ఈ మధ్య ఫెమినిస్ట్ మూమెంటు మీద తెలుగులోనే చిన్నచిన్న పుస్తకాలు కొన్ని చదివాను. మానుషి పత్రిక రెగ్యులర్‌గా చదువుతున్నాను. - పద అమ్మ భోజనానికి పిలుస్తోంది.

ఇద్దరు భోజనాలకి లేచారు.

స్త్రీలకోసం స్త్రీలే నడిపే పత్రిక " మానుషి" గురించి కాసేపు మాటాడుకున్నారు. ప్రగతి శీల మహిళా సమాఖ్య స్త్రీలకోసం ఒకపత్రిక నడపాలనుకుంటుందని చెప్పింది సృజన.

భోజనం చేశాక సృజన పుస్తకం చదువుకొంటూ నిద్రపోయింది.

లేచేసరికి నాలుగయ్యింది. బాత్రూంకువెళ్ళి మొహం కడుక్కొని వచ్చేసరికి బిలబిలాడుతూ విమల స్నేహితులంతా వచ్చారు. చంపా, మనోరమా, శైలజా వగైరా.

అత్తకి తన స్నేహితులందర్నీ పరిచయం చేసింది విమల.

" పాపం కామేశ్వరికి వచ్చేనెల్లో పెళ్లట " అన్నది మనోరమ.

" అదేంటి అంత తొందరగానా ? "

" అనుకోకుండా మంచి సంబంధం వచ్చింది అబ్బాయి బాంకు లో ఉద్యోగంచేస్తున్నాడు కామేశ్వరిని చూడగానే వెంటనే పెళ్ళిచేసుకుంటానని చెప్పాడట. పెళ్ళికాగానే తను పనిచేసే వూరు తీసుకొని వెళ్ళిపోతాడట. కట్నకానుకలు తనకు ఎంత యిచ్చినా ఫరవాలేదు. తనకా పట్టింపు లేదన్నాడట".

" అయితే ఇది ఊబిలో పడిందన్నమాట."

" మరో నాలుగు నెలల్లో పరిక్షలున్నాయి చదువు సగంలో మానిపించేస్తారా?"

" అలాంటప్పుడు ఇంటరుమీడియట్‌లోనే ఆపు చేయించాల్సింది"-

" చూశారా మీకు ఆకలి వేయనప్పుడు అన్నం తినరు. కానీ ఇష్టం లేకపోయినా అవసరం లేకపోయినా పెళ్ళిచేసుకోవలసిందే" అన్నది సృజన క్రమంగా సంభాషణలోకి దిగుతూ.

" పెళ్ళి స్త్రీపై పురుషుడు జరిపే దోపిడికి వ్యవస్తీకృతరూపం" అని ప్రారంభించింది సృజన.

" కొంచెం మామూలు మాటల్లో చెప్పండి" అన్నది మనోరమ.

సృజన చిరునవ్వునవ్వుతూ " సారీ వీలయినంతవరకూ బరువైన సాంకేతిక పదాలు వాడకుండా చెబుతాను. మనసు పెట్టి వినండి–" అని మొదలు పెట్టింది.

"పెళ్ళి స్త్రీపై పురుషుడు జరిపే దోపిడీకి అణచివేతకూ సంఘం ఆమోదించిన రూపం. తరతరాలుగా స్థిరపడి కొనసాగుతున్న ఒక పద్ధతి - ఒకప్పుడు కావలసిన పురుషుణ్ణి ఎంచుకునే స్వేచ్ఛ స్త్రీకి కొంత వరకూ ఉండేది. దీనినే స్వయంవరం అనేవారు. స్త్రీపురుషులు కలుసుకొని అప్పటికప్పుడు నిర్ణయించుకుని పెళ్ళిచేసుకునేవారు. ఇంకోరకం పెళ్లివుంది. స్త్రీ యిష్టపడితే తల్లితండ్రులకు, సంఘానికీ ఇష్టం లేకపోయినా పురుషుడు ఆమెను తీసుకొని వెళ్ళిపోయేవాడు. తదనంతరం సంఘం ఈ పెళ్ళికి కూడా ఆమోద ముద్ర వేసింది. కృష్ణుడు రుక్మిణిని ఇలాగే పెళ్లిచేసుకున్నాడు. ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు వస్తున్న కొద్దీ - సారీ - సంఘజీవితంలో రకరకాల మార్పులు వస్తున్న కొద్దీ ఆఈ పద్ధతులన్ని మారి పోయి ప్రస్తుతం అమలులోనున్న బలవంతపు పెళ్లి ఏర్పడింది. మొన్న మొన్నటి వరకూ కన్యాశుల్కం అమల్లో వుండేది. అంటే మొగవాళ్ళ ఆడపిల్లలికి కట్నంయివ్వడం.ఇది ఇప్పటికీ కొన్ని గిరిజన తెగల్లోనూ ఆదివాసి తెగల్లోనూ వుంది. అన్నట్టు గోండు స్త్రీలు పొలం దున్నుతారని మొన్న విని చాల ఆశ్చర్యపోయాను. సరే అసలు సంగతి వాళ్లల్లో ఇప్పుడు కన్యాశుల్కం పోయి వరకట్నం వచ్చింది. ఇక వరకట్నం సంగతి మీకుతెలిసిందే "-

" మగవారు ఆడదాన్ని జీవితాతం పోషిస్తాడు కనుక ముందు కట్నం రూపంలో డబ్బులివ్వడం అవసరమేనని కొందరంటారు మరి?" అన్నది మనోరమ.

' అదికాదే, ఇద్దరు కలసి వేరు కాపురం పెట్టాలంటే కొంత డబ్బుఅవసరం కదా అందుకూ కట్నం' అన్నది చంప తెలిసినదానిలాగ.

" ఈ రెండూ తప్పే- ఆడదాన్ని మగవాడు జీవితాంతం పోషిస్తున్నాడనేది తప్పు అని అడ్డంవచ్చింది విమల .

" ఆపేశావేం పూర్తిగా చెప్పుమరి" అన్నదిసృజన

" ఆడది ఎంతటి ఘోరమైన ఇంటి చాకిరీ చెస్తుందో తెలిసిందే. ఆ పనులన్నీ వేరే మనిషి చేత చేయిస్తే జీతం ఎంత యివ్వాలో లెక్కకట్టండి. స్త్రీకి తిండి, బట్టా యిస్తున్నాడు కదా అంటారు. వాటికి కూడా డబ్బులు కట్టండి. భార్యకి భర్తే ఇంకా యిచ్చుకోవలసి వుంటుంది. ఉదాహరణకు చూడండి. గవర్నమెంటు ఉద్యోగం ఏదన్నా డ్యూటీకి వెళితే టి.ఏ, డి.ఏ ఇస్తారు కదా - అంటే ప్రయాణపు ఖర్చు, భోజనం ఖర్చు. అదికాక వేరే రెమ్యూనరేషన్ - ప్రతిఫలం యివ్వం కేవలం టి.ఏ, డి.ఏ, మాత్రమే ఇస్తానంటే ఎవరన్నా డ్యూటీ చేస్తారా? అలాగే భార్య పనీను. - అంచేత మగవాడు ఆడదాన్ని పోషిస్తాడనడం సరికాదు గొడ్డులా చాకిరీ చెస్తుంది కనుకనే పోషిస్తున్నాడు ఇది ప్రతిపలమే తప్ప గొప్ప ఉపకారం కాదు. పెళ్ళానికి కూడు పెట్టడం, వూరికి వుపకారం కాదు. ఇకపోతే- కొత్తకాపురం పెట్టేవాళ్లకి ఆర్ధికంగా సాయంగా కట్నంయివ్వడం సంగతి. ఇదీ తప్పే. కట్నం, లాంఛనాలు కాక సారె అని వేరే వుంటుంది. పందిరిమంచం, బిందెలు, కంచాలు దగ్గరనుంచీ అన్నీ యిస్తారు. మగాడికి అవన్నీ కొనుక్కోగలిగిన స్తోమత వున్నాయిస్తారు. వాళ్ళు హక్కుగా అడిగి పుచ్చుకొంటారు. ముక్కుమీద గుద్ది వసూలు చేస్తారు. అలా వుండకూడదు. వాళ్లకి సహకరించడం కోసం పెద్దలెవరైనా తోచినవియివ్వచ్చు స్నేహితులు కూడా యివ్వచ్చు- ధనం రూపంలో యిత అని యివ్వడం- పైగా దానికొకరేటువుండటం, అది దాదాపు గుది బండలా తయారవడం, స్తోమతకు మించి గుంజడం యివి ఘోర అన్యాయాలు".

" యిష్టంలేకపోతే విడాకులు పుచ్చుకొని విడిపోయే హక్కు స్త్రీకి వుండటం మంచిదే కదా ".

"అఫ్‌కోర్స్ ఇదివేరే సమస్య " అన్నది చంప నవ్వుతూ.

సృజన సమాధానాలు చెప్పడం ప్రారంభించింది.

" మంచిది అలాగే కనిపిస్తుంది సాంఘిక భద్రత స్వతంత్ర్య ఆర్ధిక స్తోమత లేనప్పుడు విడాకులవల్ల ఏం వుపయోగం ?"

" మరి భరణం యిస్తారుకదా " -

" అనేక సందర్భాల్లో అది ఏమూలకీ చాలదు. చాలుతుందని అనుకున్నా - భర్తనుండి వేరుపడి వంటరిగా బ్రతికేస్త్రీకి సంఘంలో ఆమోదం లేదు. వయసులోవుంటే ఆమెకి భద్రతా తక్కువే - " కనుక భరణం యివ్వడం తగిన పరిష్కారం కాదు నావుద్దేశంలో -"

" మొగుడి బాధ భరించడం కష్టమయినప్పుడు విడాకులు పుచ్చుకోకపోతే ఎలా ?"

"నిజమే ప్రస్తుత సమాజంలో మీరుచెప్పినవన్నీ రైటే, కాని పురుషుల్లోమార్పురావాలి. వాళ్ళు జీవితాంతం తమతో సమానంగా గౌరవంగా చూసుకొస్ది పరిస్థితులకోసం మనం పోరాడాలి. విడాకులకోసం కాదు ".

" విడాకులంటే ఎలాంటిదంటే చెయ్యివిరిచేసి బాగుచేయించుకోడానికి డబ్బులివ్వడం లాంటిది. చెయ్యి విరవడమూ వద్దు. డబ్బులివ్వనూ వద్దు అంటారు సృజన గారు. అన్నది చంప.

"సరిగ్గా చెప్పావు" అన్నది మనోరమ మెచ్చుకుంటూ.

అంతా నవ్వారు. విమల నవ్వలేదు.

"ఉదాహరణ పూర్తిగా కరక్టు కాకపోయినా విషయాన్ని కరెక్టుగానే గ్రహించావు. "ఇక్కడ మనం కొన్ని విషయాలు అర్ధం చేసుకోవాలి. సోషలిస్టు వ్యవస్థలో సొంత ఆస్తికి అవకాశం లేదు. అంటే పురుషుడకి ఆస్తి వుండదు. మరి స్త్రీకిగాని ఎవరికిగాని ఆస్తిహక్కు ఎలాగ వస్తుందీ.?

"మీరు చెప్పేది బాగానే వుంది. గుడ్డికన్ను కంటె మెల్ల కన్ను నయంకదా"

"నిజమే కాని నేను చెప్పేది అర్థం చేసుకోండి" అని మృదువుగా నవ్వుతూ చెప్పనారంభించింది సృజన.

"ఆస్తిహక్కు, విడాకులహక్కు ఇలాంటివి-మధ్యేమర్గాలు. స్త్రీల పరిస్థితిని అంతగా మెరుగుపరచని శుష్కసంస్కరణలు. ఆర్థిక అసమానతలు లేని సోషలిస్టువ్యవస్థ వచ్చిందనుకోండి-అప్పుడు ఆస్తులు పంచుకోవడాలు,విడాకులుకోరుకోవడాలు అనే ప్రసక్తివుండదు. స్త్రీకి అన్నివిధాలా స్వేచ్ఛా సమానతా వుంటాయి'

"అప్పుడు మాత్రం విడాకులు వుండవా".

"బహుశా యిలా వుండవు. ఇప్పుడంత దారుణంగా వుండవు'

"మరి విడాకులు పుచ్చుకొనేటప్పుడు పిల్లల సంగతి పెద్ద సమస్య.

"అవును. దాన్ని పరిస్థితినిబట్టి నిర్ణయించాలి. పిల్లలకి ఊహ తెలిస్తే వాళ్లకే నిర్ణయించుకునే హక్కు యివ్వాలి. లేనపుడు స్త్రీ మాటకి విలువివ్వాలి. పిల్లలు సంఘంలో ఆరోగ్యంగా ఎదిగేందుకు అవకాశం యివ్వాలి'

"కని పెంచుతుంది కనుక తల్లికే పిల్లల మీద హక్కుండాలి'

" అసలు పిల్లలు లేకపోతే ఆ తగువే వుండదు".

"ఈ విషయంలోకూడా స్త్రీకి స్వేచ్ఛ వుండాలి. ఎందరు పిల్లల్ని కనాలో, ఏయే పిల్లల్ని కనాలోప్రస్తుతం పురుషుడే నిర్ణయిస్తున్నాడు. మగపిల్లలూ, ఆడపిల్లలూ సమానంగా కావాలని కొందరు, అసలు ఆడపిల్లలే వద్దని కొందరూ ఇలా నిర్ణయిస్తారు. మగపిల్లలు లేకుండా కేవలం ఆడపిల్లల్నే కన్నదనుకోండి ఇంక ఆవిడ బాధలు చెప్పనవసరంలేదు"-

"విజయనగరంలో ఒక ప్రిన్సిపల్‌గారుండేవారు. ఆయనకి వరసగా ఏడుగురు ఆడపిల్లలు".

"శారీరకంగా నీరసంగా వున్నందువల్ల ప్రస్తుతం పిల్లలు వద్దు అనుకున్నా, కుటుంబ పరిస్థితులూ, ఉద్యోగము, ఆర్థిక యిబ్బందులూ ఇలాంటివి వున్నప్పుడు బిడ్డని కన కూడ దనుకుంటే మానేసే హక్కు స్త్రీకి వుండాలి. పురుషుడు ఎంత మాత్రం బలవంతం చెయ్యకూడదు. ఆమె స్వేచ్ఛకి అడ్డురాకూడదు. అలాగే మరోమాట కూడా చెప్పుకోవాలి. సెక్స్ సుఖం పొందే స్వేచ్ఛకూడా స్త్రీకి వుండాలి."

"ఇష్టమైనపుడు ఇష్టమైన వాళ్లతో"- అని నవ్వింది చంప.

"అని దాని అర్థంకాదు. విచ్చలవిడితనానికీ, ఆరోగ్యకరమైన స్వేచ్ఛకీ తేడా తెలుసుకోవాలి. ఇష్టం లేనపుడు భర్తతోనైనా సెక్స్‌కు వ్యతిరేకించగలగాలి. భర్త సంతానాన్ని పుట్టించగలసమర్థుడు కానప్పుడుసంతానం కావాలంటే,పై వాళ్లతో సెక్స్‌సుఖం పొంది సంతానం పొందే అవకాశం యివ్వాలి. పూర్వం నియోగం అనే ఏర్పాటు వుండేది. భారతంలో పాండవులు అలాగే పుట్టారు. ఆ కాలంలో ఈ పరిస్థితి ధర్మ సమ్మతమైనదే" కాని క్రమంగా....."

"సరే మరో ప్రశ్న కొందరాడవాళ్లు చాలా గయ్యాళిగా వుంటారాకదా. । చాలా ఘోరంగా ప్రవర్తిస్తుంటారు కదా ఎందుచేతనంటారు ?"

ఏమీ అనుకోకండి. విషయం అర్థంకావడానికి మాత్రం ఓ ఉదాహరణ చెబుతాను. కొన్ని జంతువులు మనిషి కనపడగానే మీదకి ఎగురుతాయి. కొన్ని భయంకరంగా అరవడం మొదలు పెడతాయి. ఎందువల్ల? ఆ వ్యక్తి వలన తమకు ముప్పువస్తుందేమోననే భయంచేత. అదే పరిస్థితి ఇక్కడకూడాను. పురుషులు తమ మాట పలనివ్వరని ముందుగానే తెలిసినపుడు స్త్రీలు గయ్యాళిగా మారతారు. కొందరిలో ఆ లక్షణం జీర్ణించుకుపోతుంది. సాంఘిక భద్రతా రాహిత్యం, అసంతృప్త వాంఛలుకూడా ఇందుకు కొంతవరకూ కారణాలు. దీనికి కారకులు పురుషులే అంటే గయ్యాళి స్త్రీలని తయారుచేసేది. ఈ పురుష సమాజమే".

" చివరగా ఒక ప్రశ్న. లైంగిక నిర్ధారణ చేసే పరీక్షలు వస్తున్నాయి. దాని గురించి మీ అభిప్రాయం చెప్పండి."

"ఇది చాలా సంఘవిద్రోహకరమైన అంశం. కడుపులో వుండగానే బిడ్డ ఆడో, మగో తెలుసుకుని ఆడ అయితే చంపెయ్యడానికి చేస్తున్న కుట్రయిది. దాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాలి.

కర్నూలులో ముగ్గురు అక్కాచెల్లెళ్లు వరకట్నం సమస్యతో ఉరివేసుకున్న సంగతీ. హైదరాబాద్‌లో ఆడపిల్లలు చార్‌మీనార్ ఎక్కి దూకిన సంగతి చర్చించారు కొంతసేపు. తాజా వార్త వరకట్న సమస్య అనే సాకుతో గుంటూరులో ఒకాయన భార్యనీ, కొడుకునీ సినిమాకి పంపించి, పసివాళ్లయిన ముగ్గురాడ పిల్లల్ని చంపిన సంగతి చర్చించారు.

"నేనయితే వెనకా ముందూ చూడకుండా ఉరిశిక్షవేస్తాను ఆ రాస్కెల్‌కి" అన్నది చంప ఉద్రేకంతో ఊగిపోతూ. దుఃఖంతోనూ, కోపంతోనూ చంపకళ్లు ఎరుపెక్కిపోయాయి.

స్త్రీ విముక్తి ఉద్యమాల గురించి మాట్లాడుకున్నారు. సైమన్ ది బావో అనే ఫ్రెంచి రచయిత్రి కొన్ని దశాబ్దాల క్రితమే ఆడవాళ్లుపుట్టరు. ఈ సమాజం వాళ్లని తయారు చేస్తుంది. అని చెప్పిన మాట గురించి సృజన చాలా వివరంగా చెప్పింది. దక్షిణ అమెరికాలోని బొలీవియాలో ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా భార్యల సంఘం స్థాపించిన దొమితిలా బారియస్ దిచుంగార గురించి చెప్పింది.

"దొమితిలా రాసిన మా కథ వుంది కదా మీ యింట్లో? వాళ్లకి యిచ్చావాచదవమని"- అన్నది సృజన.

" వీళ్లు హార్రర్ సెంటిమెంట్ నవలలు చదివే స్టేజిలోంచి ఇంకా బయటపడలేదు. చలంగారి పుస్తకాలు, రంగనాయకమ్మగారి పుస్తకాలు యిచ్చి కొంచెం కొంచెం అలవాటుచేస్తున్నాను" అన్నది విమల.

" నాకు రంగనాయకమ్మగారి పుస్తకాలు అంటే చాలా యిష్టం. ఇదుగో ఇదే హారర్ నవలలు చదువుతుంది" అన్నది చంప మనోరమ వైపు చూస్తూ.

"నోర్ముయ్. మొన్న నీచేతిలో కిస్‌మీ కిల్‌మీ అని ఒక తెలుగు నవల చూశాను. అది చదువుతూ నేను పిలిచినా వినిపించలేదు నీకు"- అన్నది మనోరమ.

"ఆపండి, ఆపండి మీరేవేవో అడిగారు. నేను సమాధానాలు చెప్పాను. నేను సిద్ధాంతాలూ, ఉదాహరణలూ మాత్రమే చెప్పాను. నిత్య జీవిత సమస్యలతో అన్వయించుకోవలసింది మాత్రం మీరే. స్త్రీ విముక్తి పోరాటంకూడా-వర్గపోరాటంలో, అంటే మొత్తంగా సాంఘిక దోపిడీ అంతంచేసే పోరాటంలో భాగమే. కొందరు ఫెమినిస్టులు-ఉద్యమాన్ని వేరుగా చూడ్డాన్ని నేను అంగీకరించను. మా నాన్నగారు-జాగో అనే వారాయన్ని- చేసిన పొరపాటు ఇలాంటిదే. ఎతియిజమ్ అంటే నాస్తికత్వం. కేవలం మతంపై పోరాటం సాగిస్తే సంఘం మారిపోతుందంటుంది. ఎతియిజం కూడా మార్క్సిజంలో అంతర్భాగమే".

"సృజనా - ఎనిమిదయింది"-అంటూ అక్కడికి వచ్చాడు సత్యమిత్ర చెల్లెలికి టైము గుర్తు చేస్తూ.

అంతా లేచి నుంచున్నారు. అందరి చేతికీ వాచీలున్నాయి. కాని ఎవ్వరూ చూడనే లేదు. దాదాపు నాలుగున్నరకి కూచున్నారు-ఎనిమిది వరకూ మాట్లాడుకున్నారు.

"ఏమ్మా చర్చల్లో అలిసినట్టున్నారు. - యిక్కడే భోజనాలు చేసి వెళ్ళకూడదూ. వంట చేస్తాను"-

"అయ్యో సారీ మేస్టారు - ఇక మేం వెళ్తాం".

" ఏయ్ విమలా మేస్టారికి వంటలొచ్చునా?" అనడిగింది శైలజ.

"అద్భుతంగా చేస్తారు అన్నది సృజన. వంటలమీద కొంత చర్చ జరిగింది. వంట వెనక సాంకేతిక పరిజ్ఞానం వున్నదనీ, దాన్ని తక్కువ చెయ్యకూడదనీ వివరించాడు సత్యమిత్ర.

అంతా గుడ్‌నైట్ సృజనగారూ గుడ్‌నైట్ మేస్టారూ, నీక్కూడా గుడ్‌నైట్ విమల అంటూ కదిలారు.

కొందరిలోనయినా ఆలోచనలు రేకెత్తించగలిగినందుకు సృజనకు చాలా సంతృప్తి కలిగింది.

ఆ తరవాత అంతా చేరినపుడు- స్త్రీ శారీరకనిర్మాణం, సౌందర్యం మొదలైన అంశాలమీద చర్చజరిగింది.

"ఏ శరీరమయినా సాంఘిక పరిణామాల ఫలితమే. జిరాఫీ మెడ ఎందుకు పొడవుగా వుంటుందో మీ అందరికీ తెలుసు. అలాగే. స్త్రీ శరీరంలోని ప్రతిభాగానికీ సాంఘిక కారణం వుంది. పాలిచ్చేందుకూ, పునరుత్పత్తి చేసేందుకూ ఆమెలో కొన్ని శరీర భాగాలు తయారయ్యాయి. ఆ అవసరం లేదు గనక పురుషుడికి లేవు. ఏ ప్రాణిని తీసుకుని పరిశీలించినా ఈ విషయం సులభంగా అర్థమౌతుంది' అని వివరించారు సత్యమిత్రగారు.

సృజన అందుకొని–" మానవులు జంతుదశని దాటకముందు – వెనక నుంచే సెక్స్ అనుభవించేవారు. శరీరనిర్మాణంలోనే కాక సాంఘిక జీవితంలో క్రమ పరిణామం వస్తున్నకొద్దీ, వేటాడి, చేపలు పట్టి అలిసి వచ్చిన పురుషుడు ముందునుంచి సెక్స్ కోరుకున్నాడు. ఆ క్రమంలోనే స్త్రీలకు పెద్ద పెద్ద స్తనలూ, పెద్ద పెద్ద పిరుదులూ ఏర్పడ్డాయి. సెక్స్ కేవలం పునరుత్పత్తి కోసంకాక అపరిమితమైన సౌఖ్యం పొందడానిక్కూడానని మానవులు తెలుసుకున్నారు. ఇవన్నీ సామాజిక శాస్త్రవేత్తలు వివరించారు. స్తనాలు స్త్రీలలో మాత్రమే సెక్స్ ఆకర్షణకుపయోగపడ్డాయి. జంతువులలో స్తనాలు పిల్లలకు పాలిచ్చేందుకే. కనుక శరీర భాగాలు మొదట్లో అవసరాలకోసం ఏర్పడినా, తరవాత అవి సెక్స్‌ని ప్రేరేపించే కేంద్రాలుగా మారాయి. ఆవూ ఎద్దూ, ఆడగుర్రం, మగగుర్రం, ఆడమేకా మేకపోతూ ఇలా జంతువులలో ఆడామగా దూరంనుచి చూడడానికి ఒక్కలాగే వుంటాయి. ఒక్క మానవులలో మాత్రమే స్త్రీ, పురుష శరీరాలు వేరు వేరుగా వుంటాయి."

"పురుషులు ఆధిపత్యం వహించి స్త్రీలను గట్టిగా మాట్లాయనివ్వలేదు. వాళ్లూ అణిగి మణిగి మెల్లిగా కీచుగొంతుకతో మాట్లాడవలసివచ్చింది. వందలాది సంవత్సరాలుగా ఇలా మాట్లాడే సరికి వాళ్ల కంఠస్వరం సన్నంగా, సున్నితంగా మారిపోయింది. ఒకోసారి ఇప్పటికీ కొందరాడవాళ్లకి మగగొంతు వుంటుంది. కొద్దిగా నూనూగు మీసాలొస్తాయి. ఇవన్నీ స్త్రీ పురుషులు.... ఆదిలో ఒకే శారీరక లక్షణాల్తో వుండేవారనడానికి సూచనలు. సరే ఇవన్నీ ఇలా వుండగా స్త్రీలను అణచి పెట్టివుంచడంలో మతానికి చాలా ఎక్కువ పాత్ర వుంది– " అని వివరించింది. ఒక కోడెదూడ అనేక ఆవులకు సరిపోయినట్టు, సంతానోత్పత్తికి ఒక పురుషుడు అనేక మంది స్త్రీలకి సరిపోతాడు. ఒక పురుషుడు అనేకమంది స్త్రీలకు సరిపోతాడు. కనుక పురుషుణ్ణి అధికుణ్ణిగా చూడనవసరంలేదు. అనే విషయం పైకూడా అందరూ చర్చించారు.

"ఎంతో అభివృద్ధి పొందాయని మనం అనుకుంటున్న విదేశాల్లోకూడా స్త్రీల పరిస్థితి ఇంత కంటే గొప్పగాఏం లేదు. వర్జీనియా వూల్ఫ్, అలెగ్జాండ్రా కొల్లంతాయ్ మొదలైనవారి రచనలు చదివితే ఈ సంగతి తెలుస్తుంది." అన్నాడు. సత్యమిత్ర లేస్తూ .

అంతా ఆశ్చర్యపోయారు. స్త్రీ పురుష శరీరాలు వేరు వేరు కావడానికి స్పష్టమైన కారణాలు వారికి తెలీదు. స్త్రీలో పురుషుడికి ఆకర్షణీయమైన శరీర భాగాలుండటానికి కూడా కారణాలు స్పష్టంగా తెలియదు.

స్త్రీలు వారంతటవారు పుట్టని అనేక సాంఘిక కారణాల వల్ల వారి శరీరనిర్మాణం అలా రూపొందగా, పురుషాధిపత్యం వల్ల స్త్రీల మానసిక స్వభావం, ప్రవర్తన మొదలైనవి ఏర్పడడం అందరికీ స్పష్టంగా అర్ధమైంది.

పరిణామక్రమంలో స్త్రీ పురుషశరీరాలు పునరుత్పత్తికోసం వేరుకావడం వేరు, ప్రస్తుతం ఉన్నట్టుగా ఉండటానికి కారణాలు వేరు అనేది కూడా అర్ధమైంది. ఇందుకు, పురుషుడూ అతడు ఆధిపత్యం వహించే సమాజం కారణం, అనే సంగతికూడా బాగ అర్ధమైంది.

అందరి ముఖాల్లోనూ కాంతీ, వికాసం కనిపించాయి. చంప, మనోరమ, శైలజ అంతా ఉత్సాహంగా లేచారు. తమకు తెలిసిన సత్యాలు అందరికీ చెప్పి ప్రచారం చెయ్యాలి. ప్రస్తుత స్త్రీ – పురుష సమాజపు సృష్టి – అని చెప్పాలనే తపన వారిలో ఎక్కువైంది. అంతేకాదు స్త్రీని అన్ని విధాలా పురుషుడితో సమానంగా రూపొందించాలన్న బలీయమైన కోర్కె ఏర్పడింది.

*రచనా కాలం : 19-3-89, 20-3-89*
*ప్రచురణ : ఉపాధ్యాయ ప్రగతి, జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ 1996.*

---

25164